సాక్షి రాజన్న సిరిసిల్ల

ఆదివారం ♦ 24 ♦ మార్చి ♦ 2024



భగవద్గీత పఠనంతో జ్ఞానం

సిరిసిల్లటౌన్: భగవద్గీత పఠనంతో జ్ఞానం సిద్ధిస్తుందని యోగి యజ్ఞానందస్వామి పేర్కొన్నారు. బీవైనగర్ హనుమాన్ ఆలయంలో జ్ఞాన యజ్ఞంలో భాగంగా శనివారం ప్రవచనాలు వినిపించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆది(సా॥)	సహర్ సోమ(ఉ॥)
కరీంనగర్	6.26	4.47
పెద్దపల్లి	6.06	4.41
రాజన్న సిరిసిల్ల	6.33	4.55
జగిత్యాల	6.33	4.54

గరిష్టం/కనిష్టం
37.0/24.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ ఉంటుంది. రాత్రి వేళ చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో ఆది సమావేశం



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో సమావేశమైన విప్‌లు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

వేములవాడ: రాష్ట్ర నీటిపారులశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ శనివారం హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. వేములవాడ నియోజకవర్గం రైతుల సమస్యలపై చర్చించారు. పంటలకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంటనష్టం వాటిల్లిన రైతులకు సాయం చేయాలని విన్నవించారు. తమ విన్నపంతో ఎల్లంపల్లి నీటి విడుదలకు కృషి చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలకు విప్‌లు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

మన ఊరు-మన బడి పనులు పూర్తి చేయాలి



బోయినపల్లిలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో రమేశ్‌కుమార్

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని మన ఊరు-మన బడి పథకం కింద చేపడుతున్న పాఠశాల భవనం పనులు త్వరగా పూర్తి చేయాలని డీఈవో రమేశ్‌కుమార్ పేర్కొన్నారు. ఎమ్మార్సీ భవనాన్ని, హైస్కూల్‌ను శనివారం సందర్శించారు. కార్యాలయం రికార్డులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరుశాతం పరిశీలించారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

మండల కేంద్రంలోని హైస్కూల్‌తోపాటు, విలాసాగర్‌లో నిర్వహిస్తున్న పదోతరగతి పరీక్ష కేంద్రాలను డీఈవో రమేశ్‌కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎలా పరిక్షలు ఎలా రాస్తున్నారో పరిశీలించారు. ఎంఈవో శ్రీనివాస్ దీక్షిత్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు. బోయినపల్లి పదోతరగతి పరీక్ష కేంద్రాన్ని వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై పృథ్వీదర్‌గౌడ్ సందర్శించారు.

కేటీఆర్‌కు.. రైతులను పరామర్శించే టైం లేదా?

● కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి



బట్టోనితాళ్లలో వరిపంటను పరిశీలిస్తున్న కేకే మహేందర్‌రెడ్డి

ముస్తాబాద్(సిరిసిల్ల): వడగండ్లతో రైతులు నష్టపోయి దుఃఖంలో ఉంటే కనీసం పరామర్శించే సమయం మాజీ మంత్రి కేటీఆర్‌కు లేదని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి విమర్శించారు. ముస్తాబాద్, పోతుగల్, గన్నెవారిపల్లె, తెర్లుమద్ది గ్రామాల్లో వడగండ్లతో నష్టపోయిన పంట పొలాలను శనివారం పరిశీలించి, రైతులను ఓదార్చారు. మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ సిరిసిల్ల ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన కుటుంబంలో కష్టం వస్తే దానికే పరిమితమయ్యారని, సిరిసిల్లలో వడగండ్లు పడి రైతు దుర్మరణం చెందిన కనీసం అధికారులతో కూడా మాట్లాడలేదన్నారు. పదిహేనేళ్లుగా కేటీఆర్‌ను ఇక్కడ గెలిపించి ప్రజలు తప్పు చేశారన్నారు. కేటీఆర్ వచ్చిన రాకున్న ఈ ప్రాంతంలో పుట్టిన బిడ్డగా ప్రజల కష్ట సుఖాలలో పాలు పంచుకుంటానన్నారు. వ్యవసాయశాఖ మంత్రితో మాట్లాడి ఎకరాకు రూ.10వేలు ఇచ్చేలా ప్రకటన చేయించామన్నారు. జెడ్పీటీసీ గుండం నర్సయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్, నాయకులు కిషన్‌రావు, అంజన్‌రావు, రాజిరెడ్డి, రాంరెడ్డి, ముణ్య, మల్లేశం, గజ్జెల రాజు, బాల్‌రెడ్డి, నరేశ్, నర్సింలు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'పది' పరీక్షలు

సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం గణితం పరీక్ష నిర్వహించారు. పరీక్షకు 6,475 మంది రెగ్యులర్ విద్యార్థులకు 6,470 మంది విద్యార్థులు హాజరైనట్లు జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ తెలిపారు. ఆరుగురు ప్రైవేట్ విద్యార్థులకు నలుగురు పరీక్ష రాశారు.



భక్తిశ్రద్ధలతో కామునిదహనం

వేములవాడ: రాజన్న సన్నిధిలో శనివారం రాత్రి కాముని దహనం వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ మహాద్వారం వద్ద స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.



వైభవంగా డోలోత్సవం

వేములవాడ: రాజన్న సన్నిధిలో త్రిరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామి వారికి అద్దాల మండపంలో డోలోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

మత్తు జోరు.. బెట్టింగ్ హోరు



- ఉమ్మడి జిల్లాను చీడల్లా వెంటాడుతున్న జాఢ్యాలు
- జగిత్యాలలో వరుస ఘటనలతో కలవరం
- ఐపీఎల్‌తో మొదలైన ఆన్‌లైన్ బెట్టింగ్
- క్రెడిట్‌కార్డుల వినియోగం, ఆపై అప్పుల పాలు
- ఒత్తిడి పెరిగి డిప్రెషన్‌లోకి బెట్టింగ్‌బాబులు

సాక్షిప్రతినిధి,కరీంనగర్:

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో యువతను రెండు జాఢ్యాలు వెంటాడుతున్నాయి. ఒకటి గంజాయి, మరోటి బెట్టింగ్. జగిత్యాలలో బాలిక గంజాయికి బానిసైన తీరు రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. అదే సమయంలో కరీంనగర్ జిల్లాకేంద్రంలో ఈ వారంలో ఆన్‌లైన్ గేమ్స్‌లో మితిమీరిన అప్పులు చేసి, తీర్చే మార్గం తెలియక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు వాస్తవాలు వెల్లడించకపోయినా.. ఇలాంటి ఘటనలు వెలుగుచూస్తున్నాయి. తక్కువ కాలంలో కోటీశ్వరులు కావాలన్న అత్యాశతో బెట్టింగ్ వైపు, మత్తులో విహరించి లోకాన్ని ఏలాలన్న కోరికతో కొంత మంది యువత గంజాయి, మత్తు పదార్థాలకు బానిసకావడం ఆందోళన కలిగిస్తోంది.

లోన్ యాప్స్, క్రెడిట్ కార్డ్స్‌తో బెట్టింగ్..

ఇక ఉమ్మడి జిల్లా యువతలో కొందరు ఎదుర్కొంటున్న ప్రాణాంతక జాఢ్యం బెట్టింగ్. దీంతోపాటు ఆన్‌లైన్ గేమింగ్స్ కూడా. ప్రస్తుతం ఐపీఎల్ సీజన్ మొదలైంది. ఇది రెండునెలలపాటు సాగనుంది. ఇప్పటికే తెలివిగా బెట్టింగ్ యాప్స్ నిర్వాహకులు ప్రచారం ప్రారంభించారు. ఫలానా కూలీకి బెట్టింగ్‌లో ఇన్ని రూ.కోట్లు వచ్చాయని, బిచ్చగాళ్ల బిలియనీర్లు అయ్యారని సోషల్ మీడియాలో ప్రచారం. వాస్తవానికి యువతను యాప్స్ వైపు లాగేందుకు ఇదో ఎత్తుగడ. ఇందులో వీరు ప్రతీసారి సక్సెస్ అవుతుండటం గమనార్హం. సరే బెట్టింగ్ యాప్ డౌన్‌లోడ్ చేశాక..బెట్టింగ్ కోసం డబ్బు ఎలా? చేతిలో ఉన్నా డబ్బు సరిపోదు, అందుకే ఈ సమయంలోనే ఎలాంటి సంపాదన లేకుండా రూ.లక్షల కొద్దీ లిమిట్ ఇస్తూ ఉత్తపుణ్యానికి అంటగడుతున్న క్రెడిట్ కార్డ్స్, ఎలాంటి ష్యూరిటీ లేకుండా రూ.లక్షలు అప్పు ఇస్తున్న మనీలోన్ యాప్స్‌ను వీరు ఆశ్రయిస్తున్నారు.

తీర్చలేక తీవ్ర నిర్ణయాలు..

గంజాయికి అలవాటు పడ్డ వాళ్లు నేరాలు చేస్తూ బహిరంగంగానే దొరికిపోతున్నారు. ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌కు చేతిలో డబ్బులు లేకున్నా.. లోన్‌యాప్స్, క్రెడిట్ కార్డ్స్‌లను వాడి రూ.లక్షలు అప్పులు చేస్తున్నారు. వీటిని తిరిగి తీర్చాలన్నపుడు అసలు కథ మొదలవుతుంది. కొందరు మరోచోట అప్పుచేసి కడుతుండగా మరికొందరు పోగొట్టుకున్న చోటే రాబట్టుకుందామన్న సిద్ధాంతంతోనే, లేక ఎలాగూ మునిగాం కదా అని మరింత అప్పు చేసి పీకల్లోతు ఊబిలోకి కూరుకుపోతున్నారు. ఈక్రమంలోనే వీరు ఒత్తిడికి గురవుతున్నారు. బ్యాచిలర్లయితే ఆత్మహత్యలకు పాల్పడటం లేదా వివాహితుల్లో కొందరు పెళ్లాం పిల్లలను చంపి తాము చావడం లాంటి అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. రూ.లక్షలు అప్పు చేస్తున్న వారంతా ఉన్నత విద్యావంతులు, ప్రభుత్వ ఉద్యోగులు కావడం ఇక్కడ గమనార్హం.

గంజాయి విక్రేత అరెస్ట్

జగిత్యాలక్రైం: జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ శివారులో శనివారం సాయంత్రం అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 260 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఆరిఫ్ అలీఖాన్, రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు. జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేటకు చెందిన మైదం అజయ్ శనివారం సాయంత్రం ధరూర్ శివారులో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులకు సమాచారం అందింది. ఎస్సై సదాకర్ అక్కడకువెళ్లి అజయ్‌ని తనిఖీ చేయగా అతని వద్ద 260 గ్రాముల గంజాయి లభ్యమైంది. గంజాయిని స్వాధీనం చేసుకుని అజయ్‌పై కేసునమోదు చేసినట్లు సీఐ వివరించారు.

కలెక్టర్, ఎస్పీ సీరియస్

గంజాయికి బానిసైన బాలిక విషయంపై మీడియాలో భిన్న కథనాలు రావడంతో జగిత్యాల కలెక్టర్ యాస్మిన్ బాషా, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ తీవ్రంగా పరిగణించారు. ఇటీవల ఇదే జిల్లాకేంద్రంలో ఓ ఈఎన్టీ ఆసుపత్రి వైద్యుడు మార్ఫిన్ ఇంజెక్షన్లను అడ్డదారిలో అమ్ముతూ దొరికిపోయిన విషయం తెలిసిందే. జిల్లాలో వరుసగా ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం ఆందోళనకరం. నివారణ చర్యలు చేపట్టడంతోపాటు, జరుగుతున్న ప్రచారంపైనా నిశితంగా నిఘా ఉంచారు. బాలిక మతిస్థిమితం తప్పేంతలా గంజాయి వినియోగంచడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. బాలికకు అంత గంజాయి ఎలా వచ్చింది? ఎవరు విక్రయించారు? ఎవరు అలవాటు చేశారు? తదితర విషయాలపై పోలీసులు కూపీ లాగుతున్నారు. ఈ విషయంలో ఇప్పటికే పలువురిని అరెస్టు చేశారు. మరోవైపు కరీంనగర్ జిల్లాకేంద్రం, శివారులోని తిమ్మాపూర్, కొత్తపల్లి, చొప్పదండిలో వివిధ కాలేజీలో చదువుతున్న విద్యార్థులు గంజాయికి అలవాటు పడ్డారు. చాలామంది కేవలం గంజాయి తాగేందుకే ప్రత్యేకంగా రూములు అద్దెకు తీసుకుంటున్నారంటే వీరి జల్సాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. గతంలో చొప్పదండిలో ఇలాంటి స్థావరాలపై పోలీసులు దాడి చేసినా.. గంజాయివీరుల తీరులో మార్పు రావడం లేదు. వీరిలో చాలామంది పోలీసులకు అనేకసార్లు పట్టుబడ్డారు. వీరిలో కొందరు దీన్నే వృత్తిగా స్వీకరించి, సులువుగా డబ్బు సంపాదించేందుకు శాశ్వతంగా గంజాయి పెడ్లర్ల అవతారమెత్తడం గమనార్హం. గంజాయి ఏజెన్సీ ప్రాంతాల నుంచి మంచిర్యాల, మంథని, భూపాలపల్లి మీదుగా జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్ తదిరల ప్రాంతాలకు సరఫరా అవుతోంది.

సాఫ్ట్‌వేర్ కంట్రోల్ చేస్తుంది



ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ యాప్స్ విషయంలో గమనించాల్సింది ఏంటంటే అవతల ఆడేది కంప్యూటరే. దానిలోని సాఫ్ట్‌వేర్ ముందు గెలిపించి, తరువాత ఓడిపోయేలా చేస్తుంది. ఈ విషయం తెలియక చాలా మంది ముందు తాము ఏదో గెలిచామన్న భావనతో అప్పులు చేసి గేమ్స్ ఆడుతారు. ఇదంతా పథకం ప్రకారం జరిగే ప్రక్రియ. ఒత్తిడి భరించలేక యువత ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇలాంటి ప్రమాదకర బెట్టింగ్ యాప్స్‌పై ప్రభుత్వం సైతం అవగాహన కల్పించాలి. – వీరేందర్, సైకాలజిస్ట్

స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలి

● ఎస్పీ అఖిల్ మహాజన్



వేములవాడలో కవాతు నిర్వహిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్, ఇతర పోలీసులు

వేములవాడ: ప్రజలు ధైర్యంగా, స్వేచ్ఛగా ఓటుహక్కువినియోగించుకునేందుకు వారిలో నమ్మకం, భరోసా, భద్రత కల్పించేందుకే జిల్లాలో కేంద్ర సాయుధ బలగాలు, జిల్లా పోలీస్ బలగాలతో కవాతులు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. వేములవాడ పట్టణం తిప్పాపూర్ బస్టాండ్ నుంచి రాజన్నగుడి, బద్దిపోచమ్మ, పోలీస్‌స్టేషన్, తెలంగాణచౌక్, పాపన్నచౌక్ వరకు ఫ్లాగ్‌మార్చ్ శనివారం నిర్వహించారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లలో ఎలాంటి భయాందోళనలకు తావులేదని తమ లక్ష్యమన్నారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి జిల్లా పరిధిలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎవరైనా అల్లర్లు సృష్టించాలని చూస్తే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో అక్రమంగా డబ్బు, మద్యం, ఇతర విలు వైన వస్తువులు అక్రమ రవాణాను అరికట్టేందుకు ఆరు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రూ.50వేల నగదు కంటే ఎక్కువ తీసుక్తే సీజ్ చేసి జిల్లా గ్రీవియెన్స్ కమిటీకి అప్పజెప్పనున్నట్లు చెప్పారు. సీఐలు కరుణాకర్, శ్రీనివాస్, ఎస్సైలు పృథ్వీధర్, అంజయ్య, రాజు, జిల్లా పోలీస్ బలగాలు, కేంద్ర బలగాల సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా పోలీసులకు హైకోర్టు షోకాజ్ నోటీసులు

● ఏప్రిల్ 16లోగా సంజాయిషీ ఇవ్వాలని ఆదేశాలు

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసులకు హైకోర్టు షోకాజ్ నోటీసు జారీ చేసిందని సిరిసిల్లకు చెందిన మాలమహానాడు నాయకుడు రాగుల రాములు శనివారం తెలిపారు. సిరిసిల్ల పోలీసులు సివిల్ కేసుల్లో తలదూర్చుతూ.. క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నారని పేర్కొంటూ రిట్ పిటిషన్ నంబరు 7350/2024 ద్వారా హైకోర్టును ఆశ్రయించినట్లు రాములు వెల్లడించారు. ఈమేరకు రాష్ట్ర హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, డీజీపీ, జిల్లా ఎస్పీ, సిరిసిల్ల టౌన్ ఎస్‌హెచ్‌వో, ఎస్బీ సీఐలకు హైకోర్టు షోకాజ్ నోటీసులు జారీ చేసిందన్నారు. ఏప్రిల్ 16వ తేదీలోగా ఈ నోటీసుకు సంజాయిషీ ఇవ్వాలని కోర్టు ఆదేశించిందని రాగుల రాములు తెలిపారు. 2024లోనే తనపై మూడు కేసులు సిరిసిల్ల పోలీసులు నమోదు చేయడంతో తాను, తన కొడుకు అడ్వకేట్ రాగుల కరుణాకర్ హైకోర్టును ఆశ్రయించినట్లు వివరించారు.

అక్రమ నిర్మాణాలపై నోటీసులు



ముస్తాబాద్(సిరిసిల్ల): మండల కేంద్రంలో అక్రమ నిర్మాణాలపై శనివారం నోటీసులు జారీ చేసినట్లు ప్రత్యేకాధికారి, తహసీల్దార్ సురేశ్ తెలిపారు. నిబంధనలు అతిక్రమించి పనులు చేస్తున్న వారికి గతంలోనే నోటీసులు ఇచ్చామన్నారు. అనుమతులు పొందిన దానికి విరుద్ధంగా పనులు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పథకాలు రాక పరేషాన్



ఇతను ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌కు చెందిన బోండ్ల కిషన్. దినసరి కూలీగా పనిచేస్తున్నాడు. ప్రజాపాలనలో తన తల్లి పేరిట మహాలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్నాడు. వాస్తవంగా అన్ని పథకాలకు అర్హుడు. కానీ సిబ్బంది నిర్లక్ష్యంతో దరఖాస్తును ఆన్‌లైన్ చేయడంలో తప్పుగా దొర్లడంతో అన్ని పథకాలకు అనర్హుడిగా మిగిలాడు. పలుసార్లు మండల పరిషత్ కార్యాలయానికి తిరిగి తనకు పథకాలు వర్తించే విధంగా మళ్లీ ఆన్‌లైన్ చేయాలని కోరాడు. కానీ ఎడిట్ ఆప్షన్ మాత్రమే ఉండడంతో ప్రభుత్వం కొత్తగా మళ్లీ దరఖాస్తులకు అవకాశం ఇస్తేనే పథకాలు వస్తాయని అధికారులు దాటవేశారు. ఏం చేయాలో తెలియక ఆందోళన చెందుతున్నాడు.

- తప్పులతడకగా ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్
- అవగాహన లేని ఆపరేటర్లతో నమోదు
- గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలకు పేదలు దూరం
- ఎడిట్ ఆప్షన్‌తో సరిచేయలేకపోతున్న అధికారులు
- మళ్లీ అవకాశం కల్పించాలంటున్న పేదలు
- ఎన్నికల కోడ్ అమలుతో కౌంటర్లు ఎత్తివేత



పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ (ఫైల్)



ఈ చిత్రంలో కనిపిస్తున్న వృద్ధురాలు ఎల్లారెడ్డిపేట మండలం అక్కపెల్లికి చెందిన మందాటి మల్లవ్వ(70). ప్రభుత్వం ప్రకటించిన పథకాలకు ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకుంది. పింఛన్, విద్యుత్‌బిల్లు, సిలిండర్ సబ్సిడీ కోసం దరఖాస్తు చేసుకుంది. కానీ ప్రస్తుతం ఈనెలలో మొదటిసారిగా విద్యుత్‌బిల్లు మాఫీ కాకుండా యథావిధిగా వచ్చింది. దీంతో ఆందోళనకు గురైన మల్లవ్వ వెంటనే మండల పరిషత్‌కు వెళ్లి విద్యుత్ బిల్లు మాఫీపై అధికారులను అడిగింది. కానీ అధికారుల నుంచి ఎలాంటి సమాధానం లేదు. ఇలా నాలుగుసార్లు తిరిగి చివరికి కరెంట్ బిల్లు కట్టింది. ఇలా అన్ని విధాలా అర్హతలు ఉన్నా చాలా మంది జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పథకాలకు నోచుకోలేకపోతున్నారు.

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రభుత్వం నిరుపేదల సంక్షేమానికి ప్రవేశపెడుతున్న పథకాలు అధికారుల నిర్లక్ష్యంతో దరిచేరడం లేదు. ఇటీవల మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాల కోసం ప్రజల నుంచి ప్రభుత్వం దరఖాస్తులు తీసుకుంది. అర్హులు తగిన ఆధారాలతో దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుల వివరాలు త్వరగా ఆన్‌లైన్ చేయాలనే లక్ష్యంతో ఆపరేటర్లు తప్పులుగా నమోదు చేయడంతో చాలా మంది అర్హత కోల్పోయారు. జిల్లాలో 1,65,083 మంది వివిధ పథకాలకు దరఖాస్తు చేసుకోగా.. ఇందులో సగానికి పైగా కరెంట్ సబ్సిడీకి దూరమయ్యారు.

లక్ష్యం చేరుకోవాలని..

రాష్ట్ర ప్రభుత్వం గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలకు గ్రామాల వారీగా ప్రజాపాలన ద్వారా 2023 డిసెంబర్ 28 నుంచి 2024 జనవరి 6 వరకు దరఖాస్తులు స్వీకరించింది. ఈ దరఖాస్తులను జనవరి 17వ తేదీ వరకు ఆన్‌లైన్ చేయించారు. ఈ ప్రక్రియకు కంప్యూటర్ ఆపరేటర్లు ప్రభుత్వ కార్యాలయాల్లో అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ వ్యక్తులను నియమించుకున్నారు. వారికి సరైన అవగాహన లేక దరఖాస్తుదారులు అన్ని పథకాలకు దరఖాస్తు చేసుకున్నా.. ఆన్‌లైన్ చేయడంలో తప్పులు దొర్లాయి. ఫలితంగా చాలా మంది నిరుపేదలు ప్రభుత్వ పథకాలకు దూరమయ్యారు. కొందరు కరెంట్‌సబ్సిడీకి దూరమైతే.. మరికొందరు అన్ని పథకాలకు అనర్హులుగా గుర్తించబడ్డారు. అధికారుల పర్యవేక్షణ లేక, ఆపరేటర్లు నిర్లక్ష్యంగా నమోదు చేయడంతో నిరుపేదలకు పథకాలు అందడం లేదు.

అవగాహన లేక.. అనర్హులుగా మారి

ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకునే సమయంలో వివరాలు ఎలా నమోదు చేయాలో తెలియకపోవడం, చదువు రాకపోవడం దరఖాస్తుదారులకు శాపంగా మారింది. అధికారులు కనీసం గ్రామాల్లో ముందస్తుగా అవగాహన కల్పించకపోవడంతో ఎలా అప్లయ్ చేసుకోవాలో తెలియక తికమకపడ్డారు. దరఖాస్తుఫారాలలో అన్ని పథకాలకు టిక్ చేసినా.. ప్రజాపాలన సమయంలో దరఖాస్తు తీసుకున్న అధికారి సరిగ్గా నమోదు చేయకపోవడంతో అనర్హులుగా మిగిలారు. తమ తప్పిదం లేకున్నా అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో పేదలు అనర్హులుగా మారారు.

కౌంటర్లు ఎత్తివేత

ప్రజాపాలన దరఖాస్తులలో దొర్లిన తప్పులను సరిచేయడానికి మండల పరిషత్, మున్సిపాలిటీలలో ఏర్పాటు చేసిన కౌంటర్లను ఎత్తివేశారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలుకావడంతో ఎత్తివేసినట్లు అధికారులు పేర్కొన్నారు. తప్పులను సరిచేసేందుకు ఎన్నికల కోడ్ ముగిసే వరకు ఆగాల్సిందేనని స్పష్టం చేస్తున్నారు. ఎన్నికల ప్రక్రియ ముగియాలంటే ఇంకా మూడు నెలలు ఆగాల్సిందే. అప్పటి వరకు కరెంట్ బిల్లు చెల్లించాల్సిందే, గ్యాస్ సబ్సిడీకి దూరం కావాల్సిందేనని పేదలు ఆందోళన చెందుతున్నారు.

మళ్లీ అవకాశం కల్పించాలని డిమాండ్

ప్రజాపాలన సమయంలో అవగాహన లేక కొందరు వృద్ధులు, నిరక్షరాస్యులు దరఖాస్తుపత్రంలో వివరాలు నమోదు చేసి సకాలంలో అధికారులకు అందజేయని వారు జిల్లాలో చాలా మంది ఉన్నారు. వీరితోపాటు దరఖాస్తు చేసుకున్నా అధికారుల నిర్లక్ష్యంతో అన్ని పథకాలకు దూరమైన వారు సైతం ఉన్నారు. వీరు అర్హులుగా గుర్తించాలంటే ప్రభుత్వం మరోసారి ఆన్‌లైన్ సైట్‌ను ఓపెన్ చేస్తేనే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

ఆందోళన చెందొద్దు



ప్రజాపాలన దరఖాస్తుల సవరణకు అవకాశం ఉంది. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత సరిచేసుకోవచ్చు. లబ్ధిదారులు ఎవరూ ఆందోళన చెందొద్దు. తప్పులు దొర్లినట్లు మా దృష్టికొచ్చింది. ప్రత్యేక కౌంటర్ల ద్వారా సరిచేసే ప్రక్రియను చేపట్టగా.. ఎన్నికల కోడ్‌తో తాత్కాలికంగా నిలిచిపోయింది. మళ్లీ ప్రారంభిస్తాం. – జితేందర్‌రెడ్డి, సివిల్‌సప్లయ్ జిల్లా అధికారి

క్లుప్తంగా

దేవాదాయశాఖ కమిషనర్‌కు రాజన్న ప్రసాదం



రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ హన్మంతరావుకు ప్రసాదం అందజేత

వేములవాడ: రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన హన్మంతరావును వేములవాడ రాజన్న ఆలయ ఈవో కృష్ణప్రసాద్ శనివారం కలిశారు. హైదరాబాద్‌లో కలిసి ఆలయ అర్చకుల మంత్రోచ్ఛరణల మధ్య స్వామి వారి ప్రసాదాలు అందించారు. ఆలయ పర్యవేక్షకులు నాగుల మహేశ్, సీసీ ఎడ్ల శివసాయి, వేద పండితులు ఉన్నారు.

నారాయణపూర్ వాసికి డాక్టరేట్



శంషీర్

సిరిసిల్లటౌన్: బనారస్ హిందూ యూనివర్సిటీ నుంచి ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ వాసి శంషీర్ డాక్టరేట్ పొందారు. రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలోని జ్యోతి బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న శంషీర్ తెలంగాణలో తెలుగు మీడియం విద్యార్థులకు ఉద్యోగాలు లభించే అవకాశాలు, సాధ్యాసాధ్యాలపై 2010–15 వరకు పరిశోధన చేశారు. ఈ అంశంపై ప్రొఫెసర్ డాక్టర్ వినోద్‌కుమార్ మిశ్రా పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ పొందారు. ఈ సందర్భంగా జ్యోతి కళాశాల కరస్పాండెంట్ దిడ్డి శ్రీనివాస్, అధ్యాపకులు అశోక్, పద్మ, శ్రీకాంత్, రాము, వెంకటేశ్, నరేందర్‌రావు అభినందించారు. తమ గ్రామానికి చెందిన యువకుడు పీహెచ్‌డీ పట్టా సాధించడంపై నారాయణపూర్ గ్రామానికి చెందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శంషీర్‌ను అభినందించారు.

కోతుల దాడిలో మహిళకు తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): కోతుల దాడిలో ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేట మండలంలోని సింగారం గ్రామంలో వాసరి భాగ్య శనివారం రోడ్డు వెంట నడుస్తూ వెళ్తోంది. కోతులు ఒక్కసారిగా ఆమెపైకి రావడంతో పరుగులు తీసింది. అయినా వెంబడించి, దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. బాధితురాలిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. గ్రామంలో కోతుల బెడద ఎక్కువగా ఉందని, వాటిని దూరంగా తరలించాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి, చర్యలు తీసుకోవాలని కోరారు.

సర్టిఫికెట్ల పరిశీలన

సిరిసిల్లకల్చరల్: ఎస్సీ స్టడీ సర్కిల్ ద్వారా ప్రతిపాదించిన మూడు నెలల స్పెషల్ ఫౌండేషన్ శిక్షణకు ఎంపికైన అభ్యర్థుల విద్యార్హతల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియను ఈనెల 26న నిర్వహించనున్నట్లు ఎస్సీడీవో వినోద్‌కుమార్ తెలిపారు. అభ్యర్థులు తమ వెంట ఎస్సెస్సీ మెమో, డిగ్రీ ప్రొవిజనల్, మార్కుల మెమో, కులం, ఆదాయ సర్టిఫికెట్లపత్రాలు, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా పుస్తకం ఒరిజినల్ పత్రాలతోపాటు ఒక జత జిరాక్స్ పత్రాల సెట్ వెంట తీసుకురావాలని సూచించారు. నిర్దేశిత పత్రాలతో కలెక్టరేట్‌లోని ఎఫ్–26 గదిలోని ఎస్సీడీవో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

గెలిచే వరకూ పోరాటమే..



- విజయమే యువత లక్ష్యం కావాలి
- చేసే పనులతోనే గుర్తింపు
- సిరిసిల్లను ఆదర్శంగా ఉంచడమే ఆశయం
- సాక్షి ఇంటర్వ్యూలో మున్సిపల్ కమిషనర్ డి.లావణ్య

సిరిసిల్లకల్చరల్: సాధించాలనే పట్టుదల.. శ్రమిస్తేనే విజయం సాధిస్తామనే నమ్మకం..మహనీయుల జీవితాల స్ఫూర్తి.. ఆమెను గ్రూప్–2 అధికారిణిగా నిలబెట్టింది. పాలనరంగంలోకి వస్తేనే ప్రజలకు మంచి చేయొచ్చనే ఆశయం ఉన్నతోద్యోగిని చేసింది. గెలిచే వరకూ పోరాడితేనే విజేతగా నిలుస్తామనే నమ్మకం ఆమెను ఈతరం అమ్మాయిలకు స్ఫూర్తిగా నిలిపింది. చేసే పనులతోనే గుర్తింపు వస్తుందని నమ్మే సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్‌గా ఇటీవల విధుల్లో చేరిన దుబ్బాక లావణ్యతో సాక్షి ప్రత్యేక ఇంటర్వ్యూ. ఈ సందర్భంగా సాక్షితో పంచుకున్న విశేషాలు ఆమె మాటల్లోనే..

నేనూ...చదువు..

మేము ఎల్‌బీనగర్‌లో ఉండేవాళ్లం. నాన్న జ్ఞానేశ్వర్ విద్యాశాఖలో ఉద్యోగి. అమ్మ సాధారణ గృహిణి. అన్నయ్య, నేను ఇద్దరం సంతానం. నేను చిన్నప్పటి నుంచి చదువులో ముందుంటూ పదో తరగతిలో మెరిట్‌తో పాసయ్యాను. ఇంటర్మీడియెట్ తర్వాత తీగల కృష్ణారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో ఈఈఈ బ్రాంచ్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాను. ఎంబీఏ కూడా పూర్తయింది.

గుర్తింపు కోసం ప్రయత్నం

ఊహ తెలిసినప్పటి నుంచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగంపైన అంతగా ఆసక్తి లేదు. పనిచేయడం జీతం తీసుకోవడం.. అనే మూసగా జరిగే జీవితం ఇష్టం ఉండేది కాదు. నాకంటూ ఓ ప్రత్యేక స్థానం ఉండాలనే కోరుకునేది. సాధారణ ఉద్యోగంతో సంతృప్తి ఉండదనుకున్నాను. పాలన విభాగంలో చేరితే ప్రజలకు మేలు జరుగుతుందని భావించాను. అందుకే సివిల్స్ కోసం రెండేళ్లు ప్రిపేర్ అయ్యాను. ఆ సమయంలో అమ్మనాన్న కోచింగ్ వద్దన్నారు. ఎల్‌బీనగర్‌లోని ఇంటి నుంచి అశోక్‌నగర్‌లోని కోచింగ్ సెంటర్‌కు వెళ్లాలంటే గంటన్నర సమయం పట్టేది. అమ్మనాన్నలు మొదట్లో అంగీకరించలేదు. చాలా పట్టుదలతో శిక్షణ అవసరమని వాళ్లను ఒప్పించాను. నా సంకల్పాన్ని అర్థం చేసుకుని అంగీకరించారు. రోజు మూడు గంటల ప్రయాణం, ఆరు గంటల శిక్షణ, ఇంటికొచ్చాక ప్రిపరేషన్‌తో రోజంతా బిజీగా గడిచేది.

ఫస్ట్ పోస్టింగ్.. షాద్‌నగర్

2016లో గ్రూప్–2 నోటిఫికేషన్ విడుదలైంది. తర్వాత ఏడాదికి పరీక్ష నిర్వహించారు. కోర్టు కేసులతో నాలుగేళ్లపాటు జాప్యమైంది. చివరికి 2019లో విడుదలైన ఫలితాల్లో గ్రూప్–2 సాధించాను. తొలి పోస్టింగ్ షాద్‌నగర్ మున్సిపల్ కమిషనర్‌గా. ఆ తరువాత గుండ్ల పోచంపల్లిలో కమిషనర్‌గా, గ్రేటర్ హైదరాబాద్‌లో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వహించాను. నెల రోజుల క్రితం సిరిసిల్లకు బదిలీపై వచ్చాను.

శ్రమకు తగిన గుర్తింపు..

షాద్‌నగర్‌లో విధుల్లో ఉన్నప్పుడు అక్కడ పాడయిన ఓ చెరువును సుందరీకరించాం. ప్రజలకు వినియోగంలోకి తేవడంతో జాతీయ స్థాయిలో అవార్డుకు ప్రతిపాదించబడింది. తక్కువ వ్యయంతో మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించడం ఫలితాలనిచ్చింది. ఎన్నికల సమయంలో జీహెచ్‌ఎంసీలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా విధులు నిర్వహించడం ఉద్యోగ జీవితానికి స్ఫూర్తినిచ్చింది.

ఇక్కడ అన్నీ ఉన్నాయి.. కానీ..

సిరిసిల్ల మున్సిపల్‌లో మౌలిక సదుపాయాలకు కొరత లేదు. సరిపడినంత సిబ్బంది కూడా ఉన్నారు. శానిటేషన్‌కు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువ వస్తున్నాయి. వేతనాలు ఇవ్వలేక ఔట్‌సోర్సింగ్ సిబ్బంది 50 మందిని తీసేయాల్సి వచ్చింది. దీంతో ఉన్నవాళ్ల పైన పనిభారం పెరిగింది. నిధుల కొరత ఉంది. అది తీరితే ఆదర్శవంతమైన మున్సిపాలిటీగా తీర్చిదిద్దొచ్చు.

లక్ష్యం చేరే వరకు పోరాడాలి

సిరిసిల్లలో కార్మిక కుటుంబాల్లో ఉంటున్న యువత నిరాశతో ఉన్నట్టు కనిపిస్తోంది. ఉన్నత చదువులు కొనసాగిస్తూనే నిర్దిష్ట లక్ష్యంతో ముందుకుసాగాలి. ప్రస్తుతం ప్రభుత్వం కూడా కొలువుల భర్తీ విషయంలో క్లారిటీతో ఉంది. ఇది యువతకు కలిసి వచ్చే అంశం. గెలిచే వరకు పోరాటం చేస్తేనే విజేతలుగా నిలుస్తాం. అదే స్ఫూర్తితో ముందుకుసాగాలి.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ కోరారు. ఈమేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. సైబర్ నేరాలకు గురైతే తక్షణమే టోల్ ఫ్రీ నంబర్లు 1930, డయల్ 100కు సమచారం ఇవ్వాలని కోరారు. సైబర్ నేరగాళ్లు ఆశ, భయం అనే రెండు అంశాల మీద మోసాలకు పాల్పడుతున్నారన్నారు. అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీని ఆసరా చేసుకుని అమాయకులకు ఆశ చూపి అందిన కాడికి దండుకుంటున్నారన్నారు. ఈ వారంలో జిల్లాలో జరిగిన పలు సైబర్ నేరాల గురించి వివరించారు.

- సిరిసిల్ల పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకరికి గుర్తు తెలియని నంబర్ నుంచి కాల్ వచ్చింది. క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామని చెప్పగా సదరు వ్యక్తి ఓటీపీ చెప్పడంతో రూ.1.70 లక్షలు నష్టపోయినట్లు ఎస్పీ తెలిపారు.
- ఇల్లంతకుంట ఠాణా పరిధిలో పార్ట్ టైం జాబ్ కోసం ఒక వాట్సాప్ నంబర్ నుంచి మెసేజ్ వచ్చింది. తర్వాత వారిని టెలిగ్రామ్‌లో యాడ్ చేసి మింత్రా యాప్‌లో ప్రొడక్ట్స్ లింక్స్ పంపారు. వాటిని స్కాన్ చేసి స్క్రీన్ షాట్ షేర్ చేస్తే డబ్బులు వస్తాయని ఆశ చూపారు. అది నమ్మగా రూ.41వేలు మోసపోయారు.
- సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోషల్ మీడియాలో నటరాజ్ పెన్సిల్ ప్యాకింగ్ పార్ట్ టైం జాబ్ పేరుతో యాడ్ చూసి వారిని సంప్రదించారు. ఐడీ కార్డ్, మెటీరియల్ ఖర్చుల కోసం డబ్బులు పంపమనడంతో రూ.15 వేలు పంపి మోసపోయారు.
- వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో స్టాక్ మార్కెట్‌లో ఇన్వెస్ట్ చేపిస్తామని వారం రోజుల వ్యవధిలో ఒకరి నుంచి రూ.2.77లక్షలు పెట్టుబడిగా పెట్టించుకున్నారు. తర్వాత మోసపోయామని గ్రహించి పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేశారు.

హన్మాజిపేట ఆస్పత్రికి జాతీయ గుర్తింపు



రోగులకు వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ దివ్యశ్రీ

వేములవాడరూరల్: గ్రామీణులకు ఆస్పత్రి సిబ్బంది అందిస్తున్న సేవలు, ఆస్పత్రి పరిసరాలు, పచ్చదనం పరిశుభ్రతను గుర్తించిన కేంద్ర బృందం ఆ ఆస్పత్రికి జాతీయస్థాయి గుర్తింపునిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు వైద్యాధికారి వి.దివ్యశ్రీ తెలిపారు. వేములవాడరూరల్ మండలం హన్మాజిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కొన్ని నెలలుగా గ్రామీణులకు ఆస్పత్రి సిబ్బంది అందిస్తున్న సేవలను జనవరి 5, 6 తేదీల్లో కేంద్ర బృందం పరిశీలించింది. ఇక్కడ అందుతున్న సేవలపై కేంద్ర బృందం సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిపారు. పీహెచ్‌సీ 90 శాతం క్వాలిఫైడ్‌తో ఎన్‌క్వాస్ గుర్తింపు లభించినట్లు పేర్కొన్నారు. నేషనల్ హెల్త్ సిస్టం రిసోర్స్ సెంటర్ ద్వారా అందించే నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్ సర్టిఫికెట్‌ను అందజేయనున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయి గుర్తింపు రావడంతో ఏటా కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు మూడేళ్లపాటు రానున్నట్లు తెలిపారు. అవార్డు రావడంపై కలెక్టర్ అనురాగ్ జయంతి, డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు, జిల్లా క్వాలిటీ మేనేజర్ విద్యాసాగర్, డీపీవో ఉమాదేవిలకు ఆస్పత్రి వైద్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మొక్కుబడిగా సామాజిక తనిఖీ

- గతంలోని అక్రమాలపై చర్యలు శూన్యం
- రికవరీపై అధికారులకు పట్టింపు కరువు



చందుర్తిలో ఉపాధిహామీ సామాజిక తనిఖీలో నివేదికలు పరిశీలిస్తున్న అధికారులు

చందుర్తి(వేములవాడ): ఉపాధిహామీ సామాజిక తనిఖీని అధికారులు మొక్కుబడిగా ముగించారు. 2022 ఏప్రిల్ నుంచి 2024 మార్చి 31 వరకు రూ.4,68,28,420 పనులకు శనివారం ఆడిట్ నిర్వహించారు. ఈ పనుల్లో రూ.9,957 రికవరీకి ఆదేశాలు జారీ చేయగా, జరిమానా రూ.7వేలు చెల్లించాలని ఆదేశించారు. డీఆర్‌డీవో శేషాద్రి, ఎంపీడీవో ప్రదీప్, రవీందర్, విజిలెన్స్ అధికారి రామారావు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గతేడాది రికవరీపై పట్టింపేది?

చందుర్తి మండలంలోని నర్సింగపూర్ గ్రామంలో మరుగుదొడ్ల నిర్మాణం పేరిట విత్‌డ్రా చేసిన రూ.41వేలు, సనుగులలో రూ.13,350, కిష్టంపేటలో కంపోస్టుషెడ్ వద్ద మూత్రశాల పేరిట డ్రా చేసిన రూ.35వేలకు పైగా రికవరీ చేయాలని గతేడాది సామాజిక తనిఖీ సందర్భంగా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ సామాజిక తనిఖీల్లో రూ.16,957 అధికారులు రికవరీ చేస్తారని ఆడిట్‌లో పాల్గొన్న వివిధ గ్రామాల కూలీలే చర్చించుకుంటున్నారు.

26న రాజన్న ఆలయ హుండీ లెక్కింపు

వేములవాడ: రాజన్న ఆలయ హుండీని ఈనెల 26న ఉదయం 8 గంటల నుంచి లెక్కిస్తున్నట్లు ఈవో కృష్ణప్రసాద్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఆలయ అధికారులు, సిబ్బంది సకాలంలో హుండీ కౌంటింగ్‌కు చేరుకోవాలని ఆదేశించారు.

బలహీనవర్గాల సంక్షేమమే లక్ష్యం



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న వివిధ పార్టీల నాయకులు

- కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): బడుగు, బలహీనవర్గాల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఆ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. ఇతర పార్టీల మాదిరిగా ఓట్ల కోసం కాకుండా.. ప్రజల అభివృద్ధి కోసం ఆలోచిస్తామన్నారు. బీఎస్పీ మండలాధ్యక్షుడు నీరటి భాను, గౌడ సంఘం మండలాధ్యక్షుడు గంట కార్తీక్‌గౌడ్‌తోపాటు సుమారు 100 మంది కాంగ్రెస్‌లో చేరారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో వారికి పార్టీ కండువా కప్పి మహేందర్‌రెడ్డి ఆహ్వానించి, మాట్లాడారు. కాంగ్రెస్ విధానాలు నచ్చి అనేక మంది పార్టీలో చేరుతున్నారన్నారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ఐదు ఇప్పటికే అమలు చేశామని పేర్కొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

ఎల్లారెడ్డిపేటకు చెందిన చందుపట్ల రాజిరెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా.. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ పరంగా ఆదుకుంటామన్నారు. అనంతరం అదే గ్రామానికి చెందిన గడ్డం జితేందర్ తండ్రి అనారోగ్యంతో మరణించగా ఆయనను పరామర్శించారు. పార్టీ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, నాయకులు గౌస్, లింగం గౌడ్, మర్రి శ్రీనివాస్‌రెడ్డి, బండారి బాల్‌రెడ్డి, పందిర్ల సుధాకర్‌గౌడ్, చేపూరి రాజేశంగౌడ్, తిరుపతి, వంగ మల్లారెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని జిల్లెల్ల గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు శనివారం కేకే మహేందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రవీణ్ జే టోని, సీనియర్ నాయకులు వైద్య శివప్రసాద్, పుర్మాని లింగారెడ్డి, గుగ్గిళ్ల శ్రీకాంత్‌గౌడ్, శోభ, సంగీత, కొత్త రవి, పొన్నాల లక్ష్మణ్‌గౌడ్, భూపతిరెడ్డి, బాపురెడ్డి, సలీమ్, సర్దార్ పాల్గొన్నారు.

రైతులు అధైర్యపడొద్దు.. ఆదుకుంటాం

అకాలవర్షాలతో పంట నష్టపోయిన రైతులు అధైర్యపడొద్దని, ఆదుకుంటామని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేకే.మహేందర్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని తంగళ్లపల్లి, ఓబులాపూర్, గండిలచ్చపేట, వేణుగోపాల్‌పూర్ గ్రామాల్లో అకాలవర్షానికి దెబ్బతిన్న పంటలను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోనితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కేకే మాట్లాడుతూ.. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేలు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు గుగ్గిళ్ల శ్రీకాంత్, రాజశేఖర్, రవి, లక్ష్మణ్ గౌడ్, తిరుపతి, శ్రీనివాస్, రాజు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండలకేంద్రంలో జై హనుమాన్ ట్రాలీ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కాంగ్రెస్ నియోజకవర్గ కేకే మహేందర్‌రెడ్డి ప్రారంభించారు. పదేళ్లుగా ట్రాలీ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చడం అభినందనీయమని కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. జెడ్పీటీసీ గుండం నర్సయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీను, అంజన్‌రావు, కిషన్‌రావు, నర్సింలు, కొండల్‌రెడ్డి, రాజు, ఆటో యూనియన్ అధ్యక్షుడు బాలెల్లు, ఉపాధ్యక్షుడు స్వామి, ప్రధాన కార్యదర్శి దేవయ్య, కోశాధికారి చందు, కనుకయ్య, శీలం దేవయ్య, మహేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మాకు దిక్కెవరు..

- భర్త అనారోగ్యంతో మృతి
- ఇద్దరు కొడుకులతో బతికేదెట్లా?
- దాతలు ఆదుకోవాలని వేడుకోలు



ఆర్థిక సహాయం కోసం అర్థిస్తున్న తల్లి రేణుక

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): సాఫీగా సాగిపోతున్న సంసారంలో కుటుంబ పెద్ద మరణంతో వారు రోడ్డున పడ్డారు. నా అనే వారు లేకపోవడంతో ఇద్దరు కొడుకులను ఎలా సాదాలో తెలియక ఆ ఇల్లాలు దిక్కులు చూస్తుంది. దాతలు స్పందించి ఆదుకోవాలని వేడుకుంటుంది.

అనారోగ్యంతో భర్త మృతి

ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్లబొప్పాపూర్ గ్రామానికి చెందిన పుట్టి కాశయ్య అలియాస్ రవి, రేణుక దంపతులకు ఇద్దరు కొడుకులు. వారికి పెద్దగా ఆస్తులు లేకున్నా.. ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేసి రవి కుటుంబాన్ని సాదుకునేవాడు. ఈక్రమంలో అనారోగ్యానికి గురై ఇటీవల మృతిచెందాడు. అదే రోజు అతని కొడుకు శ్రావణ్‌కు పదోతరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. తండ్రి శవం ఇంట్లో ఉండగానే పుట్టెడు దుఃఖంలో శ్రావణ్ పదోతరగతి పరీక్ష రాసి వచ్చాడు. తర్వాత తండ్రి అంత్యక్రియలు నిర్వహించాడు.

అర్ధంతరంగా ఆగిన ఇంటి నిర్మాణం

రవి ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేసిన సమయంలోనే అప్పు చేసి ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించాడు. డబ్బులు సరిపోకపోవడంతో కొంత మేరకు పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. అంతలోనే రవి అనారోగ్యానికి గురయ్యాడు. తెలిసిన వారి వద్ద అప్పులు చేసి వైద్యం చేయించినా రవి ఆరోగ్యం బాగుపడకపోగా ఇటీవల మృతిచెందాడు. రవి మృతితో వారి కుటుంబం రోడ్డున పడింది. భర్త మృతితో ఒంటరిగా మారిన రేణుక ఇద్దరు పిల్లలను ఎలా పోషించేది అని ఆందోళన చెందుతుంది. దాతలు ఆదుకోవాలని వేడుకుంటుంది. రవి బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తగా పనిచేశారు. మాజీ మంత్రి కేటీఆర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య స్పందించి బాధిత కుటుంబానికి పార్టీ తరపున బీమా డబ్బులు ఇప్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆర్థిక సహాయం అందించేవారు.. ఫోన్‌పే 83743 58410లో చేయాలి.



ధర్మపురిలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

ధర్మపురి: స్థానిక శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో స్వామివారి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. నాలుగో రోజు శనివారం ప్రధాన ఆలయంతోపాటు అనుబంధ ఆలయాల్లో వేలాది మంది భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. నృసింహునికి కోడె మొక్కు, కొబ్బరి బెల్లాలు, తలనీలాలు సమర్పించారు. అంతకుముందు పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఆదివారం కోనేరులో స్వామివారి తెప్పోత్సవ, డోలోత్సవ కార్యక్రమం వీక్షించాలనుకున్న పలువురు ఒకరోజు ముందుగానే ధర్మపురికి చేరుకున్నారు. వారికి పాత టీటీడీ కల్యాణ మండపంలో ఉచితంగా అన్నదానం చేపట్టారు. తాగునీటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ శాఖ, దేవాలయం తరపున 20 చోట్ల చలివేంద్రాలు, నీడ వసతి ఏర్పాటు చేశారు.

మోత్కులకుంటను రక్షించాలి

- కుంట ఆక్రమణపై ప్రజల ధర్నా
- కబ్జా చేస్తే ఊరుకునేది లేదన్న రైతులు



కుంట వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

ముస్తాబాద్(సిరిసిల్ల): మోత్కులకుంటను రక్షించాలని కోరుతూ బట్టోనితాళ్లు, సేవాలాల్‌తండా, రాగంపల్లె ప్రజలు ఐక్యంగా ఉద్యమించారు. మూడు ఎకరాల్లో విస్తరించి ఉన్న మోత్కులకుంటను రియల్టర్లు ఆక్రమించుకోవాలని చూస్తున్నారని శనివారం ఆందోళన చేపట్టారు. ముస్తాబాద్ మండలం బట్టోనితాళ్లు, రాగంపల్లె శివారులో గుట్టల మధ్య ఉన్న మోత్కులకుంట వద్ద ధర్నా చేపట్టిన సందర్భంగా మాట్లాడారు. ముప్పైఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం భూగర్భజలాలను పెంపొందించేందుకు పనికి ఆహారం, జర్మనీ స్వచ్ఛంద సంస్థ సేవ్స్ ద్వారా చెరువును నిర్మించిందన్నారు. ఆనాడే లక్షలాది రూపాయలతో చెరువు నిర్మించడంతో కరువు నుంచి బయట పడ్డామన్నారు. ఇటీవల కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు మోత్కులకుంటను ఆక్రమించేందుకు సరిహద్దులు పెట్టారన్నారు. మాజీ సర్పంచ్‌లు కట్ట బాపురావు, కలకొండ కిషన్‌రావు, రైతులు ప్రశాంత్, భూమయ్య, దేవవ్వ, దేవదాస్, రాజు, ముణ్య, పంతులు, చంద్రయ్య, రమేశ్, మహేశ్, కట్టరవి, దేవయ్య, సుధాకర్, కృష్ణ తదితరులున్నారు.

కుంటను పరిశీలించిన కేకే మహేందర్‌రెడ్డి

మోత్కులకుంటను సిరిసిల్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి కలెక్టర్ అనురాగ్ జయంతితో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించారు. ముప్పై ఏళ్ల క్రితం నిర్మించిన కుంటను ధ్వంసం కాకుండా చూడాలని కోరారు.

ఎల్‌ఎండీకి నీటి విడుదల



బోయినపల్లి(చొప్పదండి): శ్రీరాజరాజేశ్వర(మిడ్ మానేరు) ప్రాజెక్టు నుంచి ఎల్‌ఎండీకి నీటి విడుదల కొనసాగుతోంది. ప్రాజెక్టు రివర్ స్లూయిస్ ద్వారా శనివారం ఎల్‌ఎండీకి 1,385, కుడికాల్వ ద్వారా 550, ఎడమకాల్వ ద్వారా 10 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. మిడ్‌మానేరు ప్రాజెక్టులో 9.69 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది.

ప్రేమ పేరిట డబ్బులు వసూలు

- యువకులతో సన్నిహితంగా ఉన్నప్పుడు వీడియో రికార్డు
- తర్వాత బ్లాక్‌మెయిల్
- జగిత్యాలలో ఓ మహిళ నిర్వాకం
- ఫిర్యాదు చేసేందుకు జంకుతున్న బాధితులు

జగిత్యాల క్రైం: ఓ మహిళ డబ్బు, పలుకుబడి ఉన్న వారితో స్నేహం చేస్తూ, ప్రేమ పేరిట డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ఇవ్వకపోతే వారితో సన్నిహితంగా ఉన్న వీడియోలను చూపిస్తూ బ్లాక్ మెయిల్ చేస్తున్నట్లు సమాచారం. జగిత్యాల జిల్లా కేంద్రంలో నివసించే ఓ మహిళ పలువురు యువకులతో స్నేహం చేసింది. ప్రేమాయాణం సాగించి, ఇంటికి పిలిపించుకొని, వారితో సన్నిహితంగా ఉన్నప్పుడు వీడియో రికార్డు చేసింది. తర్వాత తన అవసరాల కోసం డబ్బులు అడగడం ప్రారంభించింది. అడిగినప్పుడు డబ్బు ఇవ్వకున్నా, రమ్మన్నప్పుడు వెళ్లకున్నా ఆ వీడియోలు చూపిస్తూ బ్లాక్ మెయిల్ చేస్తోంది. ఇలా గత ఆరు నెలల్లో ఆమె బాధితులు 6 నుంచి 8 మంది ఉన్నట్లు తెలిసింది. ఆమె వేధింపులు భరించలేక ఒకరిద్దరు తమ సెల్ ఫోన్ నంబర్లు మార్చుకోగా మిగతావారు ఆమె చెప్పింది చేస్తూ నిత్యం ఆందోళన చెందుతున్నట్లు సమాచారం. మహిళ మోజులో పడినవారు ఆమె వేధింపులను భరిస్తున్నారు. కానీ, పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు జంకుతున్నారు. బాధితుల్లో ఒకరిద్దరి భార్యలకు ఈ విషయం తెలిసి, ఆ మహిళతో గొడవపడినట్లు తెలిసింది.